సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 7 । జూలై । 2023



న్యాయం చేయాలి

వీవోఏ నుంచి డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని నందివాడకు చెందిన మహిళా సంఘాల సభ్యులు కోరారు.

- 8లో ▸



ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు ఆందోళనలు చేశారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
35.2 /22.6

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

10 నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ బియ్యం పంపిణీని ఈనెల 10వ తేదీన ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఈ నెలలో ఒక్కో యూనిట్‌కు 6 కిలోలు, అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం అందిస్తామని పేర్కొన్నారు.

నేడు మహిళా గురుకులంలో స్పాట్ అడ్మిషన్‌లు

సదాశివనగర్: మర్కల్ స్టేజీ వద్ద గల మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో 2023–2024 విద్యా సంవత్సరానికిగాను శుక్రవారం స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ రాధిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఫస్టియర్‌లో బీఎస్సీ, ఎంపీసీ, ఎంఎస్‌డీఎస్, ఎంపీసీఎస్, బీజడ్‌సీ, ఎంబీజడ్‌సీ, బీఏ, బీకాం, సీఏ జనరల్‌లో ప్రవేశం కోసం ఎస్సీ విద్యార్థినులు శుక్రవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భవిత పాఠశాల తనిఖీ



భిక్కనూరు: మండల కేంద్రంలోని భవిత పాఠశాలను శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ గురువారం తనిఖీ చేశారు. దివ్యాంగ పిల్లలకు తప్పనిసరిగా ఫిజియోథెరపీ చేయించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. ఆయన వెంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ సిద్ధరాములు, ఐఆర్పీ మహేందర్ ఉన్నారు.

14న స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక

కామారెడ్డి అర్బన్: హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ఈ విద్యా సంవత్సరంలో నాలుగు, ఐదో తరగతులలో ప్రవేశాల కోసం 14వ తేదీన జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఎంపిక పోటీలు ఉంటాయని యువజన, క్రీడల జిల్లా అధికారి వై.దామోదర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మండలం నుంచి 20 మంది బాలురు, 20 బాలికలు ఈ పోటీలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి ఈనెల 26న రాష్ట్రస్థాయిలో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఇతర వివరాలకు 90309 15107, 96181 26053 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'రెగ్యులరైజ్ చేయాలి'



భిక్కనూరు: తమను రెగ్యులరైజ్ చేయాలని యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా డిమాండ్ చేశారు. గురువారం భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్ట్ టీచర్స్ ప్లకార్డులు ప్రదర్శిస్తూ మౌన దీక్ష చేశారు. అనంతరం నారాయణ గుప్తా మాట్లాడుతూ కాంట్రాక్ట్ అధ్యాపకులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు యాలాద్రి, నరసయ్య, సునీత, రమాదేవి, వైశాలి, నిరంజన్, సరిత, శ్రీకాంత్, శ్రీమాత, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడి తొలగింపు

కామారెడ్డి టౌన్: బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు భూమేష్‌ను ఆ బాధ్యతల నుంచి తొలగించడమే కాకుండా పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మెమోలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్ష ఉత్తీర్ణులైన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లను శుక్రవారం డీఈవో కార్యాలయంలో తీసుకోవాలని డీఈవో ఎస్.రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముందస్తు ప్రచారం!

- ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే కామారెడ్డిలో రాజకీయ వేడి
- ఇప్పటికే ఊళ్లను చుట్టేసిన ప్రధాన పార్టీల నేతలు
- పోటాపోటీగా వాల్ రైటింగ్
- చేరికలపైనా ఫోకస్



కామారెడ్డి నియోజకవర్గంలో రాజకీయ వేడి పెరిగింది. మూడు ప్రధాన రాజకీయ పార్టీలు దూకుడు పెంచి, ముందస్తుగా ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. జనం దృష్టిని ఆకర్షించేందుకు అప్పుడే అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీల్లో చేరికలపైనా ఫోకస్ చేశారు. ఎన్నికల కోడ్ వచ్చాక వాల్ రైటింగ్‌పై ఆంక్షలు ఉంటాయన్న ఉద్దేశంతో ముందుగానే వాల్ రైటింగ్ చేయిస్తున్నారు.

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో కీలకమైన కామారెడ్డి నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీలు అప్పుడే ఎన్నికల ప్రచారానికి తెరలేపాయి. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో సిట్టింగ్ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఊరూరా తిరుగుతున్నారు. ఇటీవల మూడు వారాల పాటు కొనసాగిన దశాబ్ది ఉత్సవాల్లో ప్రభుత్వ పథకాలతో ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. అలాగే కుల సంఘాలకు భవనాలు, ఆలయాల వద్ద కమ్యూనిటీ భవనాల కోసం ప్రత్యేక నిధులు రూ.10 కోట్లు మంజూరు చేయించి ప్రొసిడింగ్ కాపీలు అందజేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలువనున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ కొంత కాలంగా నియోజకవర్గంలోని ఊళ్లన్నింటిని చుట్టేస్తున్నారు. పట్టణంలోనూ తిరుగుతున్నారు. పార్టీ నుంచి వెళ్లిపోయిన వారిని తిరిగి సొంతగూటికి రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామ మండల స్థాయి నేతలను ఆహ్వానిస్తున్నారు. కుల సంఘాలు, ఆలయాల అభివృద్ధికి విరాళాలు అందిస్తున్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయిన జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నా రు. ఊరూరా క్యాడర్‌ను బలోపేతం చేసుకున్నారు. కుల సంఘాలు, ఆలయాల నిర్మాణాల కోసం పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అందించారు. దాదాపు రూ.25 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఊరూరా ఆలయాలు, కుల సంఘాల నిర్మాణాల కోసం భూమి పూజ చేస్తూ ఆయా సంఘాల మద్దతు కూడగడుతున్నారు. ఆయన నియోజకవర్గంలో పాదయాత్రకు కూడా రెడీ అవుతున్నారు.

ప్రజల దృష్టిని ఆకర్షించేలా..

కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలు వాల్ రైటింగ్‌పైనా దృష్టి పెట్టాయి. ప్రజల దృష్టిని ఆకర్షించేలా తమ తమ పార్టీల చిహ్నాలను ఫోకస్ చేస్తున్నారు. గ్రామాల్లో పోటాపోటీగా వాల్ రైటింగ్ చేయిస్తున్నాయి. బీఆర్ఎస్‌నుంచి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నాయకత్వం వర్ధిల్లాలంటూ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ పేరుతో వాల్ రైటింగ్ చేయిస్తున్నారు. 'మరోసారి మోదీ సర్కార్, తెలంగాణలో ఈసారి బీజేపీ ప్రభుత్వం' అంటూ బీజేపీ నేతలు ఊరూ వాడా వాల్ రైటింగ్ చేయిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు వచ్చే ఎన్నికల్లో ఇచ్చే హామీలను ఫోకస్ చేస్తూ వాల్ రైటింగ్‌తో పాటు ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

కండువా కప్పేస్తూ..

ఊరూరా తిరుగుతున్న నేతలు ఇతర పార్టీల్లోని నేతలు, కార్యకర్తలను తమ వైపు తిప్పుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామ, మండల స్థాయి నాయకులకు తమ పార్టీ కండువాలు కప్పుతున్నారు. కుల సంఘాల ప్రతినిధులనూ పార్టీలో చేర్చుకుంటున్నారు. చేరేవాళ్లతో మూడు ప్రధాన పార్టీల నేతల ఇళ్ల వద్ద నిత్యం రద్దీ కనిపిస్తోంది. అప్పుడే ఎన్నికలు వచ్చాయన్నట్టు వాతావరణం కనిపిస్తోంది. కామారెడ్డి పట్టణంతో పాటు కామారెడ్డి, దోమకొండ, బీబీపేట, మాచారెడ్డి, భిక్కనూరు, రామారెడ్డి, రాజంపేట మండలాల్లో మూడు ప్రధాన పార్టీలు ప్రత్యర్థి పార్టీల్లోని అసంతృప్తులను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో కామారెడ్డి నియోజకవర్గంలో ఎన్నికల వాతావరణం కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

'పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి'



టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్: పెంపుడు జంతువులకు తప్పనిసరిగా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా గురువారం కామారెడ్డిలోని ప్రాంతీయ పశు వైద్యశాల ఆవరణలో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేసే కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులకు సంవత్సరానికి ఒకసారి టీకాలు వేయించడం ద్వారా రేబిస్ వ్యాధిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో 77 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేశామని పశువైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో 26వ వార్డు కౌన్సిలర్ అన్మండ్ల మానస, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సింహారావ్, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్‌లు విజయ భాస్కర్, దేవేందర్, సంజయ్ కుమార్, వైద్యులు రవి కిరణ్, అనిల్‌రెడ్డి, వైద్య సిబ్బంది సాయిరెడ్డి, ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్, బాలయ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి అన్మండ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ పంపిస్తానంటూ ఏజెంట్ మోసం!

- డీఎస్పీని ఆశ్రయించిన బాధితులు
- డబ్బులు ఇప్పించాలని వేడుకోలు



సాక్షి, కామారెడ్డి: ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు అప్పులు చేసి ఏజెంట్ల చేతుల్లో పెట్టి మోసపోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. కామారెడ్డి ప్రాంతానికి చెందిన ఐదుగురు ఓ ఏజెంట్ చేతిలో మోసపోయారు. వివరాలిలా ఉన్నాయి. మాచారెడ్డి మండలం గన్‌పూర్(ఎం) గ్రామానికి చెందిన బోయిని శ్రీనివాస్, పాల్వంచ మండలం పోతారం గ్రామానికి చెందిన డప్పు రాజయ్య, శ్రీపాక సంజయ్, గ్యార పూర్ణచందర్‌లతో పాటు రామారెడ్డి మండలం రెడ్డిపేటకు చెందిన రమేశ్ గల్ఫ్ దేశాలకు వెళ్లడం కోసం లింగంపేట మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ ఏజెంట్‌ను ఆశ్రయించారు. అతడు జిరాక్స్ వీసా కాపీలు చూపించి ఒక్కొక్కరి వద్దనుంచి రూ. 50 వేలచొప్పున వసూలు చేశాడు. ఆ తర్వాత పత్తాలేకుండా పారిపోయాడు. ఐదు నెలలుగా ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కామారెడ్డి డీఎస్పీ సురేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. నమ్మించి మోసం చేసిన ఏజెంట్‌పై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని బాధితులు కోరారు.

'బల్దియా అవినీతిమయంగా మారింది'



జిల్లా కేంద్రంలోని జేపీఎన్ చౌరస్తాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: బీఆర్ఎస్ పాలనలో కామారెడ్డి బల్దియా పూర్తిగా అవినీతిమయంగా మారిపోయిందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆరోపించారు. గురువారం కామారెడ్డి పట్టణంలోని 24, 25 వార్డులలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ఎక్కడ చూసినా రోడ్లు గుంతలుగా మారాయన్నారు. నాసిరకంగా పనులు చేయడం వల్ల డ్రెయినేజీలు అధ్వానంగా మారాయని, మురికి నీరు రోడ్లపైకి వస్తోందని పేర్కొన్నారు. మున్సిపల్ నిధుల నుంచి ప్రభుత్వ విప్ సొంత వెంచర్‌కు రూ. 3 కోట్లతో రోడ్లు వేయించుకున్నారని ఆరోపించారు. బల్దియా చైర్‌పర్సన్ తండ్రితో, స్థానిక ఎమ్మెల్యేతో తమ కమిషన్ల కోసం కొట్లాడానికే కౌన్సిలర్లకు సమయం సరిపోవడం లేదన్నారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రతి ఒక్క కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం జేపీఎన్ చౌరస్తా వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీను, కౌన్సిలర్ శివ కృష్ణమూర్తి, నాయకులు సందీప్, గుడుగుల శ్రీను, చందు, భాను, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన వేతనం అందేదెప్పుడో?

- ఎండీఎం నిర్వాహకులకు వేతనాలు పెంచిన సర్కారు
- మూడు నెలలుగా ఎదురుచూపులు

ఎల్లారెడ్డిరూరల్: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సర్కారు పెంచిన వేతనం ఇప్పటికీ అమలు కావడం లేదు. పెంచిన వేతనాల కోసం మూడు నెలలుగా ఎదురు చూస్తున్నారు.

జిల్లాలోని 1,011 ప్రభుత్వ పాఠశాలల్లో 1,755 మంది మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు పనిచేస్తున్నారు. వంద మందిలోపు విద్యార్థులున్న పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండడానికి ఒకరు, 100 నుంచి 200 మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ఇద్దరు కార్మికులను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంది. వీరికి ప్రభుత్వం గతంలో వెయ్యి రూపాయల వేతనం అందించేది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వీరి వేతనాన్ని రూ. 3 వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు సంతోషించారు. అయితే వేతనాలు పెంచి నెలలు గడుస్తున్నా పెరిగిన వేతనం మాత్రం రావడం లేదు. దీంతో నిర్వాహకులు నిరాశ చెందుతున్నారు. పెంచిన వేతనాలను అందించాలని కోరుతున్నారు.



ఎల్లారెడ్డిలో వంట చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

ఇబ్బందులు పడుతున్నాం..



మాకు ప్రభుత్వం ఫిబ్రవరిలో వేతనాలు పెంచింది. కానీ మూడు నెలలుగా వేతనాలే అందడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం పెంచిన వేతనాలను వెంటనే అందించాలి.
– బాలమణి, ఎండీఎం వర్కర్, సోమార్‌పేట్

నిధులు రాగానే జమ చేస్తాం

మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులకు పెంచిన వేతనాలకు సంబంధించిన నిధులు రాలేదు. సర్కారు నుంచి నిధులు విడుదల కాగానే ఏజన్సీల ఖాతాలలో జమ చేస్తాం.
– వెంకటేశం, ఎంఈవో, ఎల్లారెడ్డి

వానాకాలం.. పాతాళానికి జలం

- జిల్లాలో పడిపోతున్న భూగర్భజలమట్టం
- నెల రోజుల్లో అరమీటరు లోతుకు...
- ఆందోళనలో రైతాంగం

వర్షాకాలంలో భూగర్భ జలాలు పైకి రావడం సహజం. కానీ ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో పరిస్థితి అందుకు విరుద్ధంగా మారింది. రోజురోజుకు భూగర్భజలాలు మరింత లోతుకు పడిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది.

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో భూగర్భ జలమట్టం మరింతగా పడిపోయింది. మే చివరలో 11.5 మీటర్ల లోతులో ఉన్న నీరు.. జూన్ నెలాఖరుకు 12 మీటర్లకు పడిపోయింది. వర్షాకాలం సీజన్ జూన్ మాసంతోనే ప్రారంభమవుతుంది. సాధారణంగా జూన్ రెండో వారం నుంచే వర్షాలు కురిసి నెలాఖరు వరకు చెరువుల్లోకి నీరు వచ్చి చేరుతుంది. కానీ ఈసారి అందుకు భిన్నంగా జూన్ నెలలో అక్కడక్కడ చిరుజల్లులు తప్ప భారీ వర్షాలు కురవలేదు. మూడు, నాలుగు మండలాల్లో మాత్రమే భారీ వర్షం కురిసింది. జూన్‌లో 144.8 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 61.5 మి.మీ. మాత్రమే కురిసింది. జూలైలో ఇప్పటివరకు 45 మి.మీ. వర్షం కురిసింది. జూన్ 1 నుంచి జూలై 5 వరకు సాధారణ వర్షపాతం 173.4 మి.మీ. కాగా... ఇప్పటివరకు నమోదయ్యింది 106.5 మి.మీ. మాత్రమే. గతేడాది ఇదే సమయానికి 301.6 మి.మీ. వర్షం కురిసింది.

కన్కల్‌లో 34 మీటర్ల లోతులో...

జిల్లాలో బసాల్ట్ రాక్ ఉన్న ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. తాడ్వాయి మండలంలోని కన్కల్‌లో భూగర్భ జలమట్టం 34 మీటర్ల లోతుకు పడిపోయింది. లింగంపేట మండలం మోతెలో 28 మీటర్లు, భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డిలో 24 మీటర్లు, గాంధారి మండలం గుర్జాల్‌లో 23 మీటర్లు, దోమకొండ మండలం అంచనూర్‌లో 22 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నాయి. ఆయా ప్రాంతాల్లో భూగర్భంలో న లుపు రాళ్లు ఎక్కువగా ఉండి ఏటా త్వరగా భూగర్భ జలమట్టం పడిపోతుంటుంది. ఈసారి కూడా భూగర్భ జలమట్టం మరింత లోతుకు పడిపోయింది. రాజంపేట, తాడ్వాయి, లింగంపేట, దోమకొండ, బీబీపేట, గాంధారి, మాచారెడ్డి, రామారెడ్డి, సదాశివనగర్ తదితర మండలాల్లోని కొన్ని గ్రామాల్లో కూడా భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. ఏప్రిల్, మే మాసాల్లో కురిసిన అకాల వర్షాల వల్లే ఇంతకాలం ఇబ్బందులు రాలేవని చెబుతున్నారు.



బోర్లలో తగ్గుతున్న నీటి మట్టం

భారీ వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలమట్టం పడిపోయి బోర్లు ఎత్తిపోతున్నాయి. చాలాచోట్ల బోర్లలో నీరు తగ్గుతోందని పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలో నిన్నామొన్నటి వరకు నీళ్లకు ఇబ్బంది లేదు. బోర్లు బాగానే పోసేవి. ఇటీవల చాలా బోర్లలో నీటి మట్టం పడిపోవడంతో ట్యాంకర్లకు గిరాకీ పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ బోర్లు ఎత్తిపోతున్నాయి. వ్యవసాయ బోర్లలో నీటిమట్టం పడిపోతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో వారం, పది రోజుల్లో భారీ వర్షాలు కురవకపోతే సాగునీటికి కష్టాలు తప్పవని రైతులు పేర్కొంటున్నారు.

కురవని వాన.. తడవని మడి..

ఈ సీజన్‌లో ఇప్పటివరకు భారీ వర్షాలు కురియలేదు. దీంతో ఎక్కడా కాలువలు పారిన జాడ లేదు. చాలా ప్రాంతాల్లో భూమి కూడా తడవలేదు. వానాకాలం పంటలు సాగు కోసం రైతులు దుక్కులు దున్నినా.. వానలు లేకపోవడంతో చాలాచోట్ల విత్తనాలు వేయలేకపోయారు. ఈనెలలో భారీ వర్షాలు కురిస్తే తప్ప పంటలు వేసే పరిస్థితులు కనిపించడం లేదు. సాధారణంగా మక్క, పత్తి, సోయా వంటి పంటల సాగుకు ఇప్పటికే విత్తనాలు వేసేవారు. ముందుగా విత్తనం వేస్తే కలుపులు కూడా తీసేవారు. కానీ ఈసారి వర్షాలు ఆలస్యం కావడంతో విత్తనాలు కూడా వేయలేకపోయారు. ఇదే సమయంలో భూగర్భ జలమట్టం పడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాంగ్రెస్‌లో పదవుల రగడ


- మదన్‌మోహన్‌రావు వర్గానికి దక్కని అవకాశం
- ఏకపక్షంగా నియమించారని అధిష్టానానికి ఫిర్యాదు!

సాక్షి, కామారెడ్డి: కాంగ్రెస్ పార్టీలో మండలాధ్యక్షుల నియామకం ఎల్లారెడ్డి నియోజకవర్గంలో వర్గపోరును మరోసారి బహిర్గతం చేసింది. ఇక్కడ మదన్‌మోహన్‌రావు వర్గానికి ఒక్క పదవి దక్కకపోవడంతో ఆయన అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా విడిపోయింది. రెండు వర్గాలు వేరువేరుగా పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు, పీసీసీ ప్రధాన కార్యదర్శి సుభాష్‌రెడ్డిలు ఎవరికి వారుగా నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పార్టీ ఆధ్వర్యంలో జరిగే అన్ని కార్యక్రమాలూ వేర్వేరుగానే ఉంటున్నాయి. ఇరువురూ పోటాపోటీగా జనంలోకి వెళ్తున్నారు. సేవా కార్యక్రమాల్లోనూ వీరు పోటీ పడుతున్నారు.

మండల అధ్యక్షుల నియామకంతో..

మండల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం విషయంలో సుభాష్‌రెడ్డి వర్గానికి చెందిన వారికే పదవులు దక్కాయి. దీనిపై మదన్‌మోహన్‌రావు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. ఎల్లారెడ్డి, ఎల్లారెడ్డి టౌన్, నాగిరెడ్డిపేట, లింగంపేట, సదాశివనగర్, గాంధారి, తాడ్వాయి, రామారెడ్డి మండలాలకు అధ్యక్షులను నియమించినట్టు డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ బుధవారం ప్రకటించారు. నియోజకవర్గంలోని ఏ మండలంలోనూ తన వర్గానికి చెందిన వారికి అవకాశం రాకపోవడాన్ని మదన్‌మోహన్‌రావు సీరియస్‌గా తీసుకున్నారు. దీనిపై తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రేకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ కమిటీల నియామక ప్రక్రియకు సంబంధించిన ఉత్తర్వులపై పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ సంతకానికి బదులు పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవితో సంతకం చేయించారని మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మిగతా నియోజకవర్గాల్లో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంతకంతో ఉత్తర్వులు వెలువడితే.. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎందుకు అలా జరగలేదో అర్థం చేసుకోవచ్చన్నారు. దీనిపై పార్టీ ముఖ్య నేతలకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. నియోజకవర్గంలో తాను పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నానని పేర్కొన్నారు.



క్లుప్తంగా

సర్టిఫికెట్ల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్: ఇంజినీరింగ్‌లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం పాలిటెక్నిక్ కళాశాలలో 163 మంది విద్యార్థుల ధృవపత్రాలు పరిశీలించారు. శుక్రవారంతో కౌన్సెలింగ్ ముగుస్తుందని పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీరామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): ఆగస్టు మొదటి వారం నాటికి పీజీ కోర్సులకు సంబంధించి సిలబస్‌ను పూర్తి చేయాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం యాదగిరి సూచించారు. గురువారం సాయంత్రం వివిధ విభాగాల హెచ్‌వోడీలతో తన ఛాంబర్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు ఆయా విభాగాలకు సంబంధించి సిలబస్‌ను ఎంతవరకు పూర్తి చేశారనే వివరాలు తెలుసుకున్నారు. వచ్చే సోమవారం కల్లా మొదటి ఇంటర్నల్ అసెస్‌మెంట్స్ పూర్తి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, కంట్రోలర్ ఎం అరుణ, హెచ్‌వోడీలు లావణ్య, అపర్ణ, చంద్రశేఖర్, నాగరాజు, సమత, స్వప్న, సంపత్, గులేరాణా, జవేరియా, జమీల్ అహ్మద్ పాల్గొన్నారు.

18 నుంచి పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో పీజీ ఎంబీఏ, ఎంసీఏ 2వ, 4వ సెమిస్టరు, ఇంటిగ్రేటెడ్ పీజీ ఐఎంబీఏ, ఐపీఈ, ఐపీసీహెచ్ 8వ, 10వ సెమిస్టరు, ఎల్ఎల్‌బీ 6వ సెమిస్టర్స్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు జూలై 18 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telangan auniversity.ac.in ను సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న 'మోడల్' టీచర్ల బదిలీ ప్రక్రియ

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వం మోడల్ స్కూల్ టీచర్ల బదిలీల ప్రక్రియ మొదలు పెట్టడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 10 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఇందులో 367 మంది టీచర్లు పనిచేస్తున్నారు. బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 5న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం ముగియనున్నది. ఈ నెల 21 తర్వాత కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మరోవైపు మోడల్ స్కూళ్లోని కొందరు టీజీటీలు తమకు కేటాయించిన పాయింట్లు తక్కువగా ఉన్నాయని కోర్టుకెళ్లినట్లు సమాచారం. దీనిపై అధికారికంగా ఎలాంటి సమాచారం లేదని జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఎస్ఎల్ఆర్ ఏడీగా శ్రీనివాసులు

సుభాష్‌నగర్: జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అసిస్టెంట్ డైరెక్టర్‌గా సిహెచ్ శ్రీనివాసులును నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఏడీగా పనిచేసిన శ్యాంసుందర్ ఇటీవల ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. శ్రీనివాసులు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. శ్రీనివాసులు హైదరాబాద్‌లో ఆ శాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన శుక్రవారం బాధ్యతలు తీసుకోనున్నారు.

ట్రాక్టర్‌ను చెక్‌డ్యాంలో పడేసిన దుండగులు

రాజంపేట: మండలంలోని నడిమితండా ఉప సర్పంచ్ షేర్‌సింగ్ ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చెక్‌డ్యాంలో పడేశారు. కేజీవీల్ ట్రాక్టర్‌ను బుధవారం రాత్రి పంటపొలం నుంచి దుండగులు దొంగలించి గ్రామ శివారులోని చెక్ డ్యాంలో పడేశారు. గురువారం ట్రాక్టర్‌ను దొంగిలించారని గుర్తించిన షేర్‌సింగ్ ఉదయం వెతకగా చెక్‌డ్యాంలో కనిపించింది.

పెంపుడు కుక్కలకు టీకా



కుక్కను ఎత్తుకొని వస్తున్న యువతి

నగరంలో వివిధ రకాల కుక్కలు కనువిందు చేశాయి. జూనోసిస్ డే సందర్భంగా గురువారం నిజామాబాద్‌లోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా నగరంలో పలువురు పెంపుడు శునకాలను తీసుకువచ్చి టీకా వేయించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



రేబిస్ టీకా వేస్తున్న డాక్టర్



షిట్జూ శునకం



ల్యాబ్రెడార్ జాతి కుక్క





జర్మన్ షెఫర్డ్ రకం కుక్క



రాట్‌వీలర్ జాతి శునకం



డ్యాష్ అండ్ డ్యాష్ రకం..

మెడికల్ ప్రాక్టీస్‌పై విద్యార్థులకు అవగాహన



మెడికల్ కాలేజీ విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఇందిర తదితరులు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మెడికల్ కళాశాల 2017 హౌస్ సర్జన్ విద్యార్థులకు గురువారం మెడికల్ ప్రాక్టీస్‌పై మెడికల్ కాలేజీ, ఐఎంఏ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేయాలన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, నాగమోహన్, జలగం తిరుపతిరావు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

మెడికల్ కళాశాలలోని ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఐఎంఏ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ రవీందర్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. గతంలో 20 మంది విద్యార్థులకు రూ.20వేల చొప్పున చెక్కులను పంపిణీ చేయగా, నాడు చెక్కులు తీసుకోని నలుగురికి గురువారం అందజేశారు.

ప్రారంభం కాని పనులపై స్పీకర్ ఆగ్రహం

వర్ని: గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేసినా.. క్షేత్రస్థాయిలో పనులు మొదలు పెట్టకపోవడంతో ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వర్నిలో చందూర్, మోస్రా, వర్ని, రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్, హౌసింగ్ పనులపై సమీక్ష సమావేశాన్ని స్పీకర్ నిర్వహించారు. వారంలోపు ఆయా పనులు ప్రారంభించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించక పోతే కాంట్రాక్టు రద్దు చేసి ఇతరులకు అప్పగించాలని సూచించారు.



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కేజ్‌వీల్ ట్రాక్టరు పట్టివేత

వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్‌లో గురువారం పట్టీలు లేకుండా తారురోడ్డుపై తిరుగుతున్న కేజీవీల్ ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. పట్టీలు లేకుండా కేజీవీల్ ట్రాక్టర్లు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నగరంలో ఈడీ సోదాలు?

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో ఖిల్లా రోడ్డులోని ముస్తాయిదాపురా కాలనీలో ముగ్గురు సభ్యులతో కూడిన ఈడీ బృందం తనిఖీలు చేసినట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో గోదాంలు ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై పోలీసులు వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో నివాసం ఉండే ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై ప్రసాద్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మద్నూర్‌కు చెందిన ప్రఫుల్ కుమార్ తాడ్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ దేవునిపల్లిలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ నెల 6న ఉదయం ఇప్పటిలాగే విధులకు వెళ్లాడు. ఉదయం 11:35 గంటల ప్రాంతంలో అతని భార్య పూజ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. చాలా చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ప్రఫుల్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోతె గ్రామానికి చెందిన మహిళ..

వేల్పూర్: మండలంలోని మోతె గ్రామానికి చెందిన కొలిప్యాక లక్ష్మి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఆమె భర్త ప్రవీణ్‌తో మనస్పర్థలు వచ్చి గురువారం ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టేకు కలప స్వాధీనం

ఇందల్వాయి: ఇందల్వాయి మండలం గౌరారం అటవీ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు దుంగలను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు రేంజ్ అధికారి హిమ చందన తెలిపారు. టేకు దుంగలు ఎవరు నిల్వ ఉంచారన్న కోణంలో విచారణ చేస్తున్నామని, స్వాధీనం చేసుకున్న దుంగలను రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు.

డిచ్‌పల్లి: అనుమతులు లేకుండా తన పంట పొలంలో ఉన్న టేకు చెట్లను నరికి వాహనంలో బోధన్‌కు తరలిస్తున్నారనే సమాచారం మేరకు డిచ్‌పల్లి సమీపంలో పట్టుకుని ఇందల్‌వాయి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు రేంజ్ అధికారిని హిమాచందన గురువారం రాత్రి తెలిపారు. మిట్టపల్లి గ్రామ శివారులోని ఒక పంట పొలంలో టేకు చెట్లను నరికి టేకు దుంగలను తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో సెక్షన్ అధికారి బాపురావు, బీట్ అధికారులు సాయికుమార్, వినోద్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బందితో కలిసి వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు.

పది ట్రాక్టర్ల ఇసుక సీజ్



సిరికొండ:మండలంలోని మైలారం రెవెన్యూ శివారు సర్వే నంబర్ 579 లో నిర్మిస్తున్న ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన పది ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ గఫార్‌మియా గురువారం తెలిపారు. ఫంక్షన్ హాల్ యాజమాని ముషీర్ అక్రమంగా ఇసుకను నిల్వ చేశాడని వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంగరాజంను విచారణకు పంపించినట్లు ఆయన తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను ఈ నెల 10న తహసీల్ కార్యాలయంలో వేలం వేస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు రూ. 5వేలు దరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఛత్రపతి నగర్‌లోని త్రివర్ణ గణేశ్ కాలనీకి చెందిన హరిపురి శారద ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్సై సాయినాథ్ తెలిపారు. వివరాలు.. శారద ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. ఆమె ఉదయం స్కూల్‌కు వెళ్లగా భర్త రవి ఆటో రిపేర్ చేయించుకోవడానికి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. దొంగలు ఇంటి తాళం పగలగొట్టి రెండు తులాల బంగారు ఆభరణాలు, ఆరు తులాల వెండి ఆభరణాలు, రూ.42 వేలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నారాయణపల్లెలో..

సిరికొండ: నారాయణపల్లెలో బుధవారం చోరీ జరిగిందని ఎస్సై నర్సింలు గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన పూజారి లక్ష్మి ఇంటి తలుపులను దొంగలు తొలగించి అల్మారాలో గల అర తులం బంగారు చెవి కమ్మలు, మాటీలు ఎత్తుకెళ్లారని చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

దుబాయిలో రోడ్డు ప్రమాదంలో మృతి



సుభాష్(ఫైల్)

తాడ్వాయి:మండలంలోని పల్లెగడ్డా తండా పరిధిలోని ఫిర్మాయికుంట తండాకు చెందిన లంబాడి సుభాష్(40) దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సుభాష్ బతుకు దెరువు కోసం గత ఐదేళ్లుగా గల్ఫ్ వెళ్తున్నాడు. మూడు నెలల క్రితం దుబాయి నుంచి సెలవుపై వచ్చి మళ్లీ వెళ్లాడు. ఈ నెల 5న రోడ్డు పక్కన పని చేస్తున్న సుభాష్‌ను కారు ఢీకొంది. దీంతో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సుభాష్‌కు భార్య చాంగ్‌బాయి, ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు.

గుండెపోటుతో ఒకరు..



హైమద్ (ఫైల్)

భిక్కనూరు: భిక్కనూరుకు చెందిన ఆర్ఎంపీ హైమద్ గురువారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామంలోని గాంధీచౌరస్తాలో ప్రథమ చికిత్సాలయం నిర్వహిస్తున్న హైమద్ మూడు రోజుల క్రితం బంధువుల ఇంటికి హైదరాబాద్ వెళ్లాడు. బుధవారం సాయంత్రం ఆయనకు ఛాతీలో నొప్పి రావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

రామారెడ్డి: అప్పుల బాధ, అనారోగ్య కారణాలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామారెడ్డిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మాసన్నగారి కలవ్వ(48) తన ఇద్దరి కుమారుల వివాహం ఒకే ఏడాది చేసింది. దీని కోసం అప్పులయ్యాయి. అలాగే కలవ్వ, ఆమె భర్త ఆరోగ్యం బాగా లేకపోవడంతో చికిత్స కోసం అప్పు చేశారు. ఈ క్రమంలో అప్పులు ఎలా తీర్చాలనే మనస్తాపంతో బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె పెద్ద కొడుకు లింబాద్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

విద్యాసంస్థలను పరిశీలించిన అధికారులు



ఖండ్‌గాం పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్



కిసాన్‌నగర్‌లో విద్యార్థులకు అడ్మిషన్ ఇస్తున్న డీఐఈవో రఘురాజ్, ప్రిన్సిపాల్

బోధన్: మండలంలోని ఖండ్‌గాం ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం డీఈవో దుర్గాప్రసాద్ సందర్శించారు. ఎంఈవో నాగ్‌నాథ్, ఎస్ఎంసీ సభ్యులు, సర్పంచ్ లాలయ్య, కల్దుర్కి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఇల్తెపు శంకర్, హెచ్ఎం సంజీవ్‌కుమార్‌తో సమావేశమయ్యారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం నిధులతో ప్రహరీ నిర్మించాలని తీర్మానం చేశారు.

కళాశాలలను తనిఖీ చేసిన డీఐఈవో

బాల్కొండ: బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలను, మెండోరా మండలం పోచంపాడ్‌లోని గురుకుల కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజు తనిఖీ చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేసిన అడ్మిషన్ల గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం అధ్యాపకులతో కలిసి కిసాన్‌నగర్, వన్నెల్(బి) గ్రామాల్లో తిరిగి ప్రచారం చేశారు. ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరారు. ప్రిన్సిపాల్స్ చిన్నయ్య, చంద్రశేఖర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు

ఆర్మూర్‌టౌన్: బడికి వెళ్లే విద్యార్థులను పనుల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవని జిల్లా లీగల్ కం ప్రొబేషనరి అధికారి ఘటడి అనిల్ హెచ్చరించారు. మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరు సంవత్సరాల నుంచి 14 ఏళ్లలోపు పిల్లలు తప్పనిసరిగా బడిలో ఉండాలన్నారు. షీ టీం ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి, కానిస్టేబుల్ సుమలత, విగ్నేష్ పాల్గొన్నారు.

దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు →



న్యాయం చేయాలని మహిళల రాస్తారోకో



ఎర్రాపహాడ్‌లో రాస్తారోకో చేస్తున్న డ్వాక్రా మహిళలు

తాడ్వాయి: మండలంలోని నందివాడకు చెందిన డ్వాక్రా మహిళలు గురువారం ఎర్రాపహాడ్‌లోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో రాస్తారోకో చేశారు. కలెక్టర్, డీఆర్‌డీవో, ఐకేపీ బ్యాంకు అధికారులు ఎవరు తమను పట్టించుకోవడం లేదని, న్యాయం జరిగేంత వరకు కదిలేదని ఆందోళన చేశారు. గ్రామంలోని 21 మహిళా సంఘాల పొదుపు డబ్బులను అదే గ్రామానికి చెందిన వీవోఏ బాబాగౌడ్ సొంతానికి వాడుకున్న విషయం తెలిసిందే. దీంతో డీఆర్‌డీవో సాయన్న జూన్ 16న గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి బాబాగౌడ్‌పై విచారణ జరిపించారు. డబ్బులను తీసింది వాస్తవమేనని బాబాగౌడ్ ఒప్పుకున్నాడు. అయితే రూ.16 లక్షలు మాత్రమే కట్టిస్తానని ఆయన చెప్పడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. తమకు రావాల్సిన రూ.36లక్షలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. బ్యాంకు, ఐకేపీ అధికారులు కుమ్మక్కై తమ డబ్బులను దోచుకున్నారని మండిపడ్డారు. ఏఎస్సై సంజీవులు తన సిబ్బందితో అక్కడికి వచ్చి సముదాయించినా వారు వినలేదు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని బ్యాంకు మేనేజర్ కరిముల్లా హామీ ఇవ్వడంతో మహిళలు రాస్తారోకోను విరమించారు.

గిరిజనులపై ఫిర్యాదు చేసిన ఫారెస్టు అధికారులు

లింగంపేట: మండలంలోని జగదాంబ తండా, అన్నారెడ్డిపల్లి తండాకు చెందిన పలువురు గిరిజనులపై ఫారెస్టు అధికారులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోడు భూముల పేరిట 9 హెక్టార్ల భూమిని చదును చేసి 3.5 హెక్టార్ల విస్తీర్ణంలో చెట్లను నరికివేశారని బీట్ అధికారి భూపతి, డిప్యూటీ రేంజ్ అధికారి రవి లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో గిరిజనులు పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. రామాయిపల్లి అటవీ శాఖ బీట్ అధికారి నిర్లక్ష్యం కారణంగా పోడు భూములకు పట్టాలు రావడంలేదని వారు ఆరోపించారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసులకు మొర పెట్టుకున్నారు. అధికారులు స్పందించి తమకు పోడు పట్టాలు అందేలా చూడాలని కోరారు. అటవీశాఖ బీట్ అధికారి ఫిర్యాదు మేరకు ఎఫ్ఆర్‌సీ ఛైర్మన్ సరిచంద్, గుగులోత్ లక్ష్మణ్, రమావత్ కుమార్, మరి కొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ప్రకాష్‌నాయక్ తెలిపారు.



పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చిన గిరిజనులు

ప్రియురాలి మోజులో పడి..

- భార్యను పట్టించుకోని భర్త
- ప్రశ్నించినందుకు వరకట్న వేధింపులు
- మనస్తాపంతో యువతి ఆత్మహత్య



భర్తతో కావ్యశ్రీ (ఫైల్)

నవీపేట: ప్రియురాలి మోజులో పడి భర్త తనను పట్టించుకోకపోవడం.. ప్రశ్నిస్తే వరకట్నం కోసం వేధించడంతో మనస్తాపం చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకుంది. నవీపేటలో బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలను నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్ గురువారం వెల్లడించారు. నిజామాబాద్‌కు చెందిన రాజేందర్ కూతురు కావ్యశ్రీ(26)కి నవీపేటకు చెందిన ఎర్ర మహేష్, అరుణల కుమారుడు ఎర్ర మనోజ్‌తో 2020లో వివాహం జరిగింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే మనోజ్‌కు మరో అమ్మాయితో వివాహేతర సంబంధం ఉంది. దీంతో కావ్యశ్రీని పట్టించుకోలేదు. కావ్యశ్రీ మానసికంగా కుంగిపోయి తన బాధను పెద్దల దృష్టికి తీసుకెళ్లగా ఇరువురికి సర్దిచెప్పారు. మనోజ్‌కు అప్పులు ఉండడంతో కావ్యశ్రీని అదనపు కట్నం కోసం మరింత వేధించాడు. భర్తతో పాటు అత్తమామలు అరుణ, మహేష్ కూడా కావ్యశ్రీని వేధించారు. మానసిక వేదనను భరించలేని కావ్యశ్రీ బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన కూతురును అదనపు కట్నం కోసం వేధించడంతోనే ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి రాజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసీపీ కిరణ్‌కుమార్, ఎస్సై రాజారెడ్డి ఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు భర్త మనోజ్, అత్తమామలు అరుణ, మహేష్‌పై కేసు నమోదు చేశామని ఏసీపీ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మోపాల్: మండలంలోని శ్రీరాంనగర్ తండాకు చెందిన సురేందర్, గబ్బర్‌సింగ్ ద్విచక్రవాహనంపై జిల్లాకేంద్రానికి వెళ్తుండగా మోపాల్ శివారులో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో సురేందర్ ఇంటర్ చదువుతున్నాడు. కళాశాల పనినిమిత్తం సురేందర్, గబ్బర్‌సింగ్ నిజామాబాద్ వైపు ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తున్నారు. మోపాల్ శివారులో ముందుగా ఉన్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పి పడిపోయారు. ప్రమాదంలో సురేందర్ తలకు తీవ్ర గాయం కాగా, గబ్బర్‌సింగ్ కాలు విరిగింది. వెంటనే నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి ఆటోలో తరలించారు. వైద్యుల సూచన మేరకు పరిస్థితి విషమంగా ఉన్న సురేందర్‌ను హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉందని, ప్రస్తుతం కోమాలో ఉన్నాడని, శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు సూచించినట్లు గ్రామస్తులు తెలిపారు. గబ్బర్‌సింగ్ నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఇదేవిషయమై పోలీసుల వివరణ కోరగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.



ఘటన స్థలంలో క్షతగాత్రులు